క్లుప్తంగా

అసోసియేట్ టీచర్‌గా అపర్ణ



పొందూరు: దామోదర సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీలో మండలంలోని తోలాపి గ్రామానికి చెందిన దుంపల అపర్ణ అసోసియేట్ టీచర్‌గా ఉద్యోగం సాధించారు. బీసీ–ఏ విభాగంలో ఉన్న ఏకైక పోస్టుకు ఎంపికయ్యారు. ఇదే యూనివర్సిటీలో ఎంఎల్ పూర్తి చేసి పీహెచ్‌డీ చేస్తున్నారు. తల్లిదండ్రులు దుంపల శ్రీనివాసరావు, సుశీల ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దుంపల రామారావు, పప్పల రాధాకృష్ణ, ఏపీటీఎఫ్ విభాగం సభ్యుడు పప్పల తిరుమలరావు, మొగదాల రమణారావు, కోరుకొండ విజయకుమార్, రిటైర్డ్ ఆర్ఐఓ దుంపల శ్యామలరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

గొట్టా పోలమ్మకు ప్రత్యేక పూజలు



గొట్టా పోలమ్మను దర్శించుకుంటున్న రెడ్డి శాంతి

హిరమండలం: మండంలోని గొట్టా గ్రామంలోని గొట్టా పోలమ్మ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వాహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రాణాప్రతాప్‌కు ఆహ్వానం



హిరమండలం:ఈ నెల 19, 20వ తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతర డాక్టర్ కె.ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. హిరమండలం మండలంలోని రుగడ గ్రామానికి చెందిన యువ కవి, రచయిత రాణాప్రతాప్‌కు సోమవారం ఆహ్వానం పత్రిక పంపించారు. రాణాప్రతాప్ మాట్లాడుతూ తనను ఇటువంటి కార్యక్రమంలో భాగస్వామ్యం చేసిన శ్రీశ్రీ కళావేదికకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న శ్రీలత

ఆమదాలవలస: ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలంలో భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆమదాలవలసకు చెందిన నాట్య శ్రీనృత్య కళానికేతన్ వ్యవస్థాపకురాలు కూన శ్రీలత ఆదివారం రాత్రి కూచిపూడి నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. దసరా మహోత్సవాల్లో భాగంగా దేవస్థానంవారు నిర్వహించిన ఈ ధార్మిక సాంస్కృతిక ఉత్సవాల్లో శ్రీలత పాల్గొన్నారు. కూచిపూడి విశ్వవిద్యాలయం నాట్యాచార్యులు డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసుల నృత్య సారథ్యంలో ఆదియోగి సాంస్కృతిక రూపకాన్ని ప్రదర్శించి అభిమానుల ప్రశంసలందుకున్నారు.

ఒక్కరోజే 25 దరఖాస్తులు



నరసన్నపేట: అప్లికేషన్లను పరిశీలిస్తున్న సీఐ రమణమూర్తి

నరసన్నపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్‌లో ఉన్న 12 మద్యం దుకాణాలకు 35 అప్లికేషన్లు వచ్చాయని సీఐ వివి రమణమూర్తి తెలిపారు. శనివారం నాటికి 10 అప్లికేషన్లు రాగా.. సోమవారం ఒక్కరోజే 25 అప్లికేషన్లు వచ్చాయని తెలిపారు. బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు సమయం ఉందన్నారు.

నాలుగు దరఖాస్తులు..

పాతపట్నం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 8 మద్యం దుకాణాకు సోమవారం ఆఫ్‌లైన్‌లో నాలుగు దరఖాస్తులు వచ్చాయని సీఐ కె.కృష్ణారావు తెలిపారు. పాతపట్నం, సారవకోట మండలాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. పాతపట్నం మండలంలో నాలుగు, సారవకోట మండలంలో నాలుగు దుకాణాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

41 దరఖాస్తులు..

ఆమదాలవలస: స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట మండలాలకు సంబంధించి 13 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. సోమవారం సాయంత్రం నాటికి మొత్తం 41 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్‌సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

● ఆక్రమణలు తొలగించండి



హిరమండలం తహసీల్దార్ కార్యాలయ రహదారిలోని శ్మశాన వాటిక స్థలం ఆక్రమణకు గురవుతుందని భవనం నిర్మాణ దాత సింహాద్రి కాశీప్రసాద్ తెలిపారు. శ్మశానంలో ఆక్రమణలకు గురవుతున్న స్థలాన్ని సోమవారం పరిశీలించారు. కొంతమంది రైతులు శ్మశానం చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్నారని, దీనిపై రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

- హిరమండలం

● సత్కారం



పాతపట్నం మండలంలోని సీది గ్రామంలో అజాద్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, సుబేదార్ చిన్నాల పాపారావు ఆధ్వర్యంలో విశ్రాంత సైనికులకు సోమవారం సన్మానించారు. దేశ రక్షణలో ప్రాణాలను సైతం అర్పించేది జవానులేనని పాతపట్నం విశ్రాంత సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు టంకాల రామారావు అన్నారు. విశ్రాంత సైనికులు లాల్ కిరణ్, రావాడ శ్యాంసుందర్, బొజ్జ శంకర్‌కు గ్రామస్తులు, అజాద్ యూత్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

- పాతపట్నం

భక్తిభావం



ప్రతీ ఇంట్లో ఉన్న చిన్నపిల్లలకు ఆధ్యాత్మిక భావాలను అలవాటు చేయాలని సత్యసాయి భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణరావు, సేవాద్ లావేటి చిన్నికృష్ణ అన్నారు. సత్యసాయి 21వ పర్తియాత్ర సందర్భంగా ఎల్.ఎన్.పేట మండలం శ్యామలాపురం గ్రామంలో భజన పాటలు, ఆధ్యాత్మిక కీర్తనలు అలపిస్తూ స్వామి పాదుకలను సోమవారం ఊరేగింపు నిర్వహించారు. పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలవికాస్ గురువు ఎల్.శైలజ, ఎ.సాయికృష్ణ, సత్యాసాయి భక్తులు పాల్గొన్నారు.

- ఎల్.ఎన్.పేట

అందని కందిపప్పు

- రేషన్ లబ్ధిదారులకు ఈ నెలలో బియ్యంతోపాటు పంచదార మాత్రమే పంపిణీ
- రాగులు, గోధుమ పిండికి కోత
- ఓవైపు మార్కెట్‌లో మండిపోతున్న నిత్యావసరాల ధరలు



ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

నియోజకవర్గంలో రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాలు, కార్డుదారుల వివరాలు

మండలం	ఎఫ్‌పీఎస్	రేషన్‌కార్డులు	ఎండీయూ
పాతపట్నం	47	20,299	14
హిరమండలం	31	12,241	9
కొత్తూరు	61	22,634	17
మెళియాపుట్టి	44	16,675	12
ఎల్.ఎన్.పేట	36	10,961	7

హిరమండలం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రేషన్ సరుకుల్లో భారీగా కోత పెట్టింది. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే బియ్యం, కందిపప్పు, పంచదార, గోధుమ పండి, రాగులు తదితర సరుకుల పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నియోజకవర్గంలోని 219 రేషన్ షాపుల పరిధిలో ఉన్న 82,810 మంది రేషన్ లబ్ధిదారులకు కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. జులై, ఆగస్టు, సెప్టెంబర్ లలో కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేయగా.. ఈ నెల కోటాలో బియ్యంతోపాటు పంచదారను మాత్రమే పంపిణీ చేస్తున్నారు. మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో ప్రభుత్వం ఇచ్చి మాట తప్పడంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ హామీలు ఏమయ్యాయి?

ఎన్నిలక సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను జనం నాలుగు నెలలుగా గుర్తు చేసుకుంటేనే ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ లబ్దిదారులకు బియ్యం, సరుకులు ఇంటి వద్దకే అందించడాన్ని జీర్ణించుకోలేని కూటమి నాయకులు.. అక్రమాలు చేస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన సంగతి తెలిసిందే. పేదలకు ముఖ్యమై సరుకులను ప్రతీ నెలా ఠంచన్‌గా అందిస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు పత్తా లేకపోవడంతో ఎవరని ప్రశ్నించాలో తెలియక పేదలు అయోమయంలో పడ్డారు. ప్రతీ నెలలోనూ వచ్చే నెల ఒకటి నుంచి అన్ని సరుకులు అంటూ ఊదరగొట్టడం, ఆ తరువాత చేతులు ఎత్తేయడం ఈ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందంటూ లబ్ధిదారులు అంటున్నారు.

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర నాణ్యతను బట్టి రూ.180 నుంచి రూ.210 వరకు విక్రయిస్తున్నారు. గోధుమ పిండి కిలో రూ.70 పలుకుతుండగా, రాగులు కేజీ రూ.50లుగా ఉంది. గడిచిన నాలుగు నెలలుగా ప్రతీ పది రోజులకు ఒకసారి నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం ఆదుకుంటుందని భావించిన పేదలకు ప్రతినెలా నిరాశే ఎదురవుతోంది.

హామీని నిలబెట్టుకోవాలి



ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఎటుపోయాయి. పేదలకు బియ్యం మాత్రమే అందిస్తే సరిపోతుందా. కందిపప్పు ఇవ్వడంలేదు. ఎన్నికల సమయంలో రేషన్ లబ్దిదారులకు పంచదార, కందిపప్పు, గోధుమ పిండి ఇస్తామని, బియ్యం వద్దనుకుంటే రాగులు ఇస్తామని చెప్పారు. అవేవి ఇవ్వకుండా కేవలం ప్రకటనలు చేయడం సరికాదు. బయట మార్కెట్‌లో సరుకుల ధరలు మండిపోతున్నాయి.

– జి.సింహచలం, సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు

పండగ నెలలో కూడా పప్పు లేదా?



కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ షాపుల ద్వారా కందిపప్పు సరఫరా లేదు. కనీసం పండగ నెలల్లోనైనా కందిపప్పు సరఫరా చేసి ఉంటే బాగున్ను.

–గులివిందుల లలిత, తంప గ్రామం, హిరమండలం మండలం

ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరంగి మురళి, బైరాగినాయుడు

నరసన్నపేట: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన పార్టీ పదువులు పొందిన నాయకులు ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు ముద్దాడ బైరాగినాయుడు, చింతు రామారావు, రాజాపు అప్పన్న, కేసీహెచ్‌బీగుప్త పిలుపునిచ్చారు. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకునిగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, రాష్ట్ర డాక్టర్స్ విభాగం అధ్యక్షునిగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పార్టీ నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. మధ్యాహ్నం 3 గంటలకు వీరు పదవీ ప్రమాణ స్వీకారం చేపడతారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతీ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలకు చెందిన ప్రతినిధులు హాజరుకావాలన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాట్లు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ధర్మాన కృష్ణదాస్ స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రణాళికతోనే అభివృద్ధి



నరసన్నపేట: మాట్లాడుతున్న కృష్ణమోహన్

నరసన్నపేట: పంచాయతీల అభివృద్ధికి ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు భాగస్వామ్యం కావాలని ఏపీఎస్ఐఆర్‌డీ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు సోమవారం ప్రారంభించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ పంచాయతీల్లో వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌ల పాత్రను వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వనరులు పెంపొందించుకునేందుకు కృషి చేయాలన్నారు. శిక్షణకు 34 పంచాయతీల నుంచి 102 మంది హాజరు కావాల్సి ఉండగా.. మొదటి రోజు 40 మంది హాజరయ్యారు.

పొందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు పంచాయతీ పరిపాలనపై సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమైయ్యాయి. ఎంపీపీ కిల్లి ఉషారాణి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మన్మథరావు, ఈఓపీఆర్డీ సింహాచలం శిక్షణ ఇచ్చారు. చట్టపరంగా పరిపాలన, విధులు, బాధ్యతలను వివరించారు. సభలు, సమావేశాల నిర్వహణపై అవగాహన కల్పించారు.

జలుమూరు: ప్రజాప్రతినిధులకు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన ఉండాలని పంచాయతీరాజ్ సహాయక కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. మండల పరిషత్‌కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు.

సారవకోట: దేశంలో అమలవుతున్న పంచాయతీ రాజ్ వ్యవస్థ గొప్పదని శిక్షణ విభాగపు అసిస్టెంట్ కమిషనర్ మురళీమోహన్ అన్నారు. మండల పరిషత్ ఆవరణలో ఉప సర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంపీడీఓ మోహనకృష్ణ, ఈఓపీఆర్డీ ప్రభాకరరావు ఉన్నారు.

సరుబుజ్జిలి: ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా పనిచేస్తే పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీఓ ఎం.పావని అన్నారు. పంచాయతీలో 100 రోజుల ప్రణాళికలపై ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు.

ఎల్.ఎన్.పేట:గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమైనదని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటిని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి జయమోహన్ పాడి పాల్గొన్నారు.

మెళియాపుట్టి: గ్రామ పంచాతీల అభివృద్ధిలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు.

పాతపట్నం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అందరూ సహకరించాలని సూపరింటెండెంట్ తిరుపతి పట్నాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు సోమవారం పంచాయతీ విధులు, బాధ్యతలపై శిక్షణ ఇచ్చారు.

హిరమండలం: గ్రామ పంచాయతీల బలోపేతానికి అందరి సహకారం అవసరమని ఎంపీడీఓ కాశీప్రసాద్ అన్నారు. ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇచ్చారు. ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం పంచాయతీ నందవ గ్రామంలో రహదారిని నిర్మిస్తున్నారు. సర్పంచ్ ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామానికి వెళ్లడానికి రహదారి లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీ నిధులతో రహదారి నిర్మాణం చేపట్టామని తెలియజేశారు. రహదారి నిర్మాణంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ సవర ఆదినాయుడు, వార్డు మెంబర్ నగేష్, గ్రామస్తులు మోహన్‌రావు, రంగయ్య, విశాఖరావు, విశ్వనాథం, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి



కలెక్టర్ ఫిర్యాదు చేస్తున్న సురేష్‌కుమార్

బూర్జ: మండలంలోని కాఖండ్యాం ఇసుక ర్యాంపులో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని గుత్తావల్లి గ్రామానికి చెందిన సనపల సురేష్‌కుమారు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 27న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకే తనపై నిర్వాహకులు దాడి చేశారన్నారు. నదీ గర్భం నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వేళల్లో కాకుండా వారికి నచ్చిన సమయంలో ఇసుక రవాణా జరుగుతుందన్నారు. భూగర్భ గనులశాఖ సిబ్బంది రికార్డుల నిర్వహణను నామమాత్రంగానే నిర్వహిస్తున్నారన్నారు. తనపై ఎస్సీ, ఎస్టీ, పీఓఏ, ఏఎల్‌టీ తదితర కేసులు స్థానిక పోలీసులు నమోదు చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తనపై నమోదైన కేసులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

85 మందికి నేత్ర పరీక్షలు

పొందూరు: స్థానిక సత్యసాయి సేవా సమితి మందిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 85 మందికి డాక్టర్ శ్రీవిన్య కంటి పరీక్షలు చేపట్టారు. 30 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ దున్న రాధాకృష్ణ, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సజావుగా టెట్

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో సోమవారం నిర్వహించిన టెట్ పరీక్షకు 615 మంది హాజరయ్యారు. రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓ దాలినాయుడు తెలిపారు. ఉదయం షిఫ్టులో 335 మందికి 24 మంది, సాయంత్రం షిఫ్టులో 335 మందికి 31 మంది గైర్హాజరయ్యారన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు హారిక



నరసన్నపేట: స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థిని బెవర హారిక జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. రాజమహేంద్రవరంలో జరుగుతున్న 37వ రాష్ట్ర అంతర్ జిల్లాల అథ్లెటిక్ పోటీల్లో రన్నింగ్‌లో ప్రథమంగా నిలిచింది. లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం పొందినట్లు కళాశాల డైరెక్టర్ సి.హెచ్.దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు.

మహాచండీ అలంకరణలో..

శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు సోమవారం వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారు మహాచండీ దేవిగా, హిరమండలంలోని పెద్దకోరాడలో గల పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారు మహాచండీ అలకంరణలో, నరసన్నపేట మండలం ఉర్లాం మార్కెట్ కూడలిలో దుర్గాదేవి మహా చండీ, సరుబుజ్జిల మండలం పురుషోత్తపురంలోని సూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద గల అమ్మవారు మహాచండీ అవతారంలో పూజలు అందుకున్నారు. సారవకోట మండలం అవలింగిలోని నీలమణి అమ్మవారిని శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు.

- సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: మహాచండీ దేవిగా నీలమణిదుర్గమ్మ



సరుబుజ్జిలి: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



హిరమండలం: మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన నీలమణిదుర్గమ్మ



సారవకోట: కూరగాయలతో అలంకరణలో నీలమణి అమ్మవారు



నరసన్నపేట: మహాచండీ దేవి అవతారంలో దుర్గాదేవి

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

ఎల్.ఎన్.పేట: పండ్ల తోటల్లో అధిక దిగుబడులను సాధించేందుకు సేంద్రియ సాగు పద్ధతులను అలవాటు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ హరికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని శ్యామలాపురం వద్ద హెర్ప్స్ సేవా సంస్థ అధ్యక్షుడు గురుగుబెల్లి రామశంకర్ ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్గానిక్, ఫెయిర్ ట్రేడ్ పద్ధతులతో పండ్ల తోటలను కాపాడుకోవడంతోపాటు పూత, పిందే నిలిచేందుకు దోహదపడుతుందన్నారు. రసాయన ఎరువులు అధికంగా వినియోగించటం వల్లభూసారం నశిస్తోందన్నారు. సేంద్రియ ఎరువులు, వర్మీ కంపోస్టు, కుళ్లిన గత్తం లాంటి ఎరువులు వాడటం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఇచ్చే రాయితీలను వివరించారు. ఉద్యానవన అధికారి అయంతి, ఉపాధి హామీ పథకం ఏపీఓ వి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రూ.10 నాణేలు వ్యాపారులు తీసుకోవాలి

సారవకోట: రూ.10 నాణేలు వ్యాపారులు తీసుకోవాలని సారవకోట ఎస్‌బీఐ మేనేజర్ ఇప్పిలి భానోజీరావు సూచించారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ మోహనకృష్ణ, మండల స్థాయి అధికారులతో రూ.10 నాణేలు చలామణిపై చర్చించారు. రెవెన్యూ, మండల పరిషత్ విభాగాలలో పనిచేస్తున్న గ్రామస్థాయి సిబ్బంది ద్వారా ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నాణేలు చెల్లవని ఏ బ్యాంకులూ చెప్పడం లేదన్నారు. తాము కూడా గ్రామాల్లో ప్రచారం చేస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

సారవకోట: మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీ కోసం కార్యక్రమానికి 37 వినతులు వచ్చాయి. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 19, పంచాయతీ రాజ్ శాఖకు 13, విద్యుత్ శాఖకు 3, నీటిపారుదల, విద్యా శాఖలకు ఒక్కొక్క వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆయా సమస్యలు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ప్రత్యేకాధికారి లోకనాథం, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.